క్లుప్తంగా

వర్షాలతో నారుమడులకు ఊపిరి

మాడుగుల రూరల్: మండలంలో మూడు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వరి నారుమడులకు ఊపిరి పోశాయి. 15 రోజులు పాటు ఎండల తీవ్రతతో వరి నారుమడులు ఎండిపోయాయి. వ్యవసాయ మోటారు పంపుసెట్లు ద్వారా నారుమడులకు నీరు పెట్టారు. వరుణుడు కరుణించడంతో వరినారుకు జీవం పోసింది. 70 శాతం మేర వరినారు వేశారు. మరో వారం రోజులు పుష్కలంగా వర్షాలు కురిస్తే, దమ్ములు ప్రారంభం కానున్నాయి.

ధ్యానంతో ఏకాగ్రత సాధ్యం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గురువు సూరి అప్పారావు

కె.కోటపాడు: ధ్యానం ద్వారా శ్వాసపై ఏకాగ్రత చూపాలని పిరమిడ్ ధ్యాన గురువు సూరి అప్పారావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం సాయంత్రం ధ్యానంతో ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సూరి అప్పారావు మాట్లాడుతు రోజూ ప్రతి ఒక్కరూ ధ్యానం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ధ్యానం వల్ల చదువుపై ఆసక్తి, ఏకాగ్రత పెరిగి మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. సద్బుద్ధితో అధ్యాపకులను గౌరవిండంతో పాటు చెడు అలవాట్ల బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మురుగు నిల్వలతో దోమల వృద్ధి



ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి మాదంనాయుడు, సర్పంచ్ ఎరుకునాయుడు

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలను లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ కుటుంబంపై ఉందని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా చౌడువాడలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, తదితరులు పాల్గొన్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ మురుగు నిల్వల్లో లార్వా వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారిన పడతారన్నారు. ఈ నేపథ్యంలో మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత



వైద్యాధికారి శ్రావణి

రోలుగుంట: వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదముందని రోలుగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణి తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో మంగళవారం ఆమె మాట్లాడారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలను పాటించాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

గొలుగొండ: కృష్ణదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో నాగాపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 50 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేశారు. వాతావరణంలో మార్పులు దృష్ట్యా ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. వైద్య సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన ప్రైవేటు బస్సు



రోడ్డు మార్జిన్ దిగి తుప్పల్లోకి వెళ్లిన ప్రైవేటు బస్సు

నాతవరం: నర్సీపట్నం -తుని మార్గమధ్యలో ప్రైవేటు బస్సుకు ప్రమాదం తప్పింది. రోజూ ఈ బస్సు కాకినాడ జిల్లాలో రొయ్యల పరిశ్రమలకు నాతవరంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలను తీసుకెళ్తోంది. ఎప్పటి మాదిరిగానే మంగళవారం తెల్లవారు జామున వస్తున్న బస్సు గాంధీనగరం అటవీ ప్రాంతంలో ప్రమాదశావత్తు అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దిగి తుప్పల్లోకి వెళ్లి ఆగిపోయింది. అక్కడ వెదురుపొంత బలంగా నిలువరించడంతో ఇది బోల్తా పడలేదు. డ్రైవరు ఒక్కరే ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

నిధులున్నా.. మీనమేషాలేనా?

- అసంపూర్తిగా డి. గొటివాడ – రాజంపేట రోడ్డు పనులు
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.9.10 కోట్ల మంజూరు
- ఉరకగెడ్డపై వంతెన నిర్మించక డోలీమోతలు
- వర్షాకాలంలో 7 గ్రామాల గిరిజనులకు నరకయాతన
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఉధృతంగా ప్రవహిస్తున్న ఉరకగెడ్డ



బురదమయంగా మారిన కొత్తవలస గిరి గ్రామం రోడ్డు

మాడుగుల

నియోజకవర్గం	మాడుగుల
మండలం	మాడుగుల
పంచాయతీ	శంకరం
ఉరకగెడ్డ బాధిత గిరి గ్రామాలు	7
పంచాయతీ జనాభా	4,200
బురదమయంగా ఉన్న రహదారి గ్రామాలు	- మునిపల్లి, చుట్టిగెడ్డ, తాడివలస

మాడుగుల: దశాబ్దాలుగా రాళ్లూ **రప్పలపై నడుస్తూ** అష్టకష్టాలు పడుతున్న గిరిజన**ులకు నాణ్యమైన** రహదారి సౌకర్యం కల్పించాలని **గత వైఎస్సార్‌సీపీ** ప్రభుత్వం సంకల్పించింది. వెంట**నే నిధులు మం**జూరు చేసి పనులు సైతం **ప్రారంభించింది.** ఈలోగా ఎన్నికల కోడ్ రావడం**తో అర్థాంతరంగా** పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. దాంతో వానొస్తే బురద రోడ్డుపై నడవలేక ఉధృతిగా ప్రవహించే ఉరకగెడ్డ దాటలేక ఏడు గ్రామాలకు చెందిన గిరిజనుల ఆక్రందన వర్ణనాతీతంగా మారింది.

గత ప్రభుత్వంలో రూ.9.10 కోట్ల మంజూరు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉరకగెడ్డపై వంతెన నిర్మాణంతోపాటు డి. గొటివాడ నుంచి రాజంపేట వరకు రోడ్డు ఏర్పాటుకు రూ.9.10 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో ఉరకగెడ్డ నుంచి రాజంపేట వరకు కొండగుట్టలు చదును చేశారు. కొండపై ఉన్న రాజంపేట గ్రామానికి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈలోగా ఎలక్షన్ కోడ్ రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదు.



గోతులమయంగా మారిన తాడివలస రోడ్డు

పర్యవసానంగా నాటి నుంచి నేటి వరకు కురిసిన వర్షాలకు మరలా రోడ్డు గోతులమయంగా మారిపోయింది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆయా గ్రామాలకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారింది. దీనికితోడు ఉరకగెడ్డ ప్రవాహం వల్ల వర్షాకాలంలో మాడుగుల రాలేక ఏడు గిరిజన గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వంతెన, రోడ్డు నిర్మించాలని ఆందోళనలు...

రెండు నెలల క్రితం వంతెనతోపాటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకుడు ఇరటా నరసింహమూర్తి ఆధ్వర్యంలో గిరిజనులు నిరసనలు చేపట్టారు. ఈ విధంగా వలుమార్లు ఆందోళనలు చేపట్టినా కూటమి ప్రభుత్వంలో చలనం లేదు. దాంతో తమ బాధలు ఎవ్వరికీ చెప్పుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కురిస్తే రాకపోకలు బంద్

వర్షం కురిస్తే చాలు ఉరకగెడ్డ ప్రవాహం వల్ల శంకరం పంచాయతీలో గొప్పూరు, వెలగలపాడు, కొత్తవలస, తాడివలస, మామిడిపాలెం పి. రాయిపాలెం, రాజంపేట గ్రామాల గిరిజనులు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మాడుగులతోపాటు ఇతర ప్రాంతాల్లో ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితులు దాపురిస్తున్నాయి. పంచాయతీలో మునిపల్లి, తాడివలస, చుట్టిగెడ్డ రోడ్లు బురదమయంగా మారిపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా ఆయా గ్రామాలు ప్రజలు నరకయాతన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లతోపాటు ఉరక గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

ఉరకగెడ్డపై వంతెన నిర్మించాలి



ఉరకగెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ఏడు గిరిజన గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు ప్రసవ సమయంలో కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కావడంతో కొంత మేర పనులు చేశారు. ఈలోగా ఎలక్షన్ కోడ్ రావడంతో అప్పట్లో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. సంబంధిత అధికారులు స్పందించి ఉరకగెడ్డపై వంతెనతోపాటు రాజంపేట వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– శోలం రమేష్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు

శాకంబరిగా వాసవీమాత



రావికమతం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరి అవతారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసంలో ఇలా ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేయడం వల్ల పాడిపంటలు, సిరిసంపదలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లుతారన్నారు. ఆర్య వైశ్యులు సారె ఊరేగింపుతో ఆలయానికి చేరుకుని వివిధ రకాల మిఠాయిలు సమర్పించారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఏఎస్ఐగా పదోన్నతి



బుచ్చెయ్యపేట: స్థానిక హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పి. సత్యనారాయణకు ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. నాలుగేళ్లగా ఇక్కడ హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న ఆయన మంగళవారం ఏఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ ఆదేశాలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లోనే ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తారని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణను పలువురు సిబ్బంది అభినందించారు.

కింతలి వీఆర్పీపై విచారణ

మాడుగుల రూరల్: మండలంలో కింతలి గ్రామ పంచాయతీలోని ఉపాధి పనుల్లో వీఆర్పీ అవకతవకలకు పాల్పడ్డారని సామాజికి తనిఖీ బృందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం విచారణ నిర్వహించారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, ఉపాధి ఏపీవో మురళీకృష్ణ స్థానిక పంచాయతీ కార్యాలయంలో వీఆర్పీ, కూలీలు, గ్రామస్తులు సమక్షంలో విచారణ చేపట్టారు. కింతలి వీఆర్పీ ఎ. గంగాధర్ రూ.2.83 లక్షలు అవకతవకలకు పాల్పడ్డారని గతంలో సామాజిక తనిఖీ బృందం ఇచ్చిన నివేదికపై విచారణ నిర్వహించారు. సర్పంచ్ మైచర్ల భవానీ, ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు పంచాయతీ కార్యదర్శి తిరుమలదేవి, టెక్నికల్ సహాయకుడు సత్యం, 225 మంది వేతనదారులు హాజరయ్యారు. వీఆర్పీ తప్పు లేదని విచారణ బృందానికి తెలిపారు. సామాజిక తనిఖీ బృందం వారు తమని విచారణ చెయ్యలేదని, గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూర్చొని నివేదిక తయారు చేశారన్నారు. గ్రామసభలో తాము అభ్యంతరం చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. గృహ నిర్మాణ చెల్లింపుల్లో వీఆర్పీ తప్పు లేదని రాతపూర్వకంగా ఎంపీడీవోకు తెలియజేశారు.



విచారణ చేస్తున్న ఎంపీడీవో అప్పారావు, ఏపీవో తదితరులు

నేత్ర శస్త్రచికిత్సలకు 26 మంది ఎంపిక

దేవరాపల్లి: విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో స్థానిక సత్యసాయి దివ్య మందిరం ప్రాంగణంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ ఆప్తామాలజిస్ట్ ఆర్. దుర్గాభవానీ 50 మంది రోగుల నేత్రాలను పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 26 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఆపరేషన్ చేసి అదే బస్సులో తీసుకువస్తామని క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్. అశ్వనికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఇట్ల వెంకటపతి, వి.రమామణి, బి.మంగలక్ష్మి, సిహెచ్. దేముడమ్మ, సిబ్బంది భాను పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించండి

కె.కోటపాడు: గ్రామస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై డ్వాక్రా మహిళలకు ప్రజలకు అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం చినబాబు తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏ, ఓబీలతో గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళిక-2025 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జీవన ప్రమాణాల మెరుగు, ఆరోగ్యం, పారిశుధ్యం, సామాజిక బాధ్యత, సహజ వనరులు, మౌలిక వసతుల కల్పన, సాంఘిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకూ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆర్.యశోద, సీసీలు వెంకటరావు, సురేష్, రాంబాబు, సత్యనారాయణ, సింహాచలంనాయుడు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం చినబాబు

ఆవులకు థైలేరియా నివారణ టీకాలు



ఆవుకు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

చీడికాడ: పాడి ఆవుల్లో వచ్చే థైలేరియా నివారణకు వ్యాక్సినేషన్‌ను పాడి రైతులు వినియోగించుకోవాలని ఖండివరం పశువైద్యాధికారి సి.హెచ్.గణేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని అప్పలరాజుపురంలో మంగళవారం నిర్వహించిన థైలేరియా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాధి పిరుదులు ద్వారా సంక్రమిస్తుందన్నారు. తీవ్రమైన జ్వరంతోపాటు పాలు దిగుబడి అధికంగా తగ్గిపోతుందన్నారు. మూడు నెలల నుంచి ఆరు నెలల చూడు పశువులకు వ్యాక్సిన్ వేయాలన్నారు.

రూ.7 లక్షలతో నిమ్మకట్టు గేట్ల మరమ్మతులు

- తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్‌కుమార్

నాతవరం: నిమ్మకట్టు ఆనకట్టు గేట్లు రూ.7 లక్షలతో మరమ్మతులు చేయనున్నట్టు తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. మండలంలో రాజుపేట అగ్రహారం సమీపంలో నిమ్మకట్టు శిథిలమైన గేట్లును మంగళవారం ఆయన మెకానికల్ జేఈ ఉమాశ్రీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 12 లక్షలతో ప్రధాన కాలువల అభివృద్ధి పనులు వేసవిలో పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం శిథిలమైన గేట్లను మెకానికల్ ఇంజనీర్ల బృందం పరిశీలించిందని, త్వరలో పనులు ప్రారంభిస్తారన్నారు. దీనిపై జేఈ ఉమాశ్రీ సిబ్బందికి సూచనలు చేశారు. ఖరీఫ్ సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలని మన్యపురట్ల తాండవ నీటి సంఘం అధ్యక్షుడు అప్పన దివాణం అధికారులను కోరారు. తాండవ ప్రాజెక్టు వర్కు ఇన్‌స్పెక్టరు అప్పారావు, రైతులు పాల్గొన్నారు.



నిమ్మకట్టు వద్ద శిథిలమైన గేట్లు పరిశీలిస్తున్న జేఈలు శ్యామ్‌కుమార్, ఉమాశ్రీ

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సత్కారం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం ప్రసాద్

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులకు మంగళవారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హెచ్‌ఎం డి.ఎస్.ఎస్.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో ఇక్కడ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పని చేసిన రెడ్డి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు భీమవరపు వెంకట దేముళ్లు, బోజంకి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, రాపర్తి పద్మావతిలను ఘనంగా సన్మానించారు. వారందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, మహేష్, మాధవరావు, త్రినాథ్, కొండమ్మ, మనోహర్, సోములమ్మ, సుగుణకుమారి, శ్యామల పాల్గొన్నారు.

జాతీయ జెండా ప్రదర్శన



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: జాతీయ జెండా స్వీకరణ దినోత్సవం సందర్భంగా మాకవరపాలెం మండలం తూటిపాల యూపీ స్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ జెండాను ప్రదర్శించారు. హెచ్‌ఎం బీమారావు మాట్లాడుతూ జాతీయ జెండాను పింగళి వెంకయ్య తయారు చేశారన్నారు. దీన్ని స్వాతంత్ర్య భారతదేశ జాతీయ జెండాగా స్వీకరించిన రోజు ఇదేనన్నారు. జాతీయ జెండాను అందరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రాము, సుధా, మాధవి, లోవరాజు పాల్గొన్నారు.

భూ వివాదంలో 9 మంది బైండోవర్

కోటకోట: మండలంలోని పరవాడపాలెం వద్ద భూ వివాదంలో 19 మందిని మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. సుమారు 4.50 ఎకరాల ఈనాం భూమి విషయమై రెండు వర్గాలు తమదంటే తమదని గొడవ పడుతూ ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై విచారించి ముందు జాగ్రత్తగా రెండు వర్గాలను హాజరు పర్చగా తహసీల్దార్ తిరుమలరావు బైండోవర్ చేశారన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కె.కోటపాడు ఎంఈవోలు

కె.కోటపాడు: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని రోజూ మెనూ ప్రకారం అందించాలని మండల విద్యాశాఖాధికారులు డి.వి.డి. ప్రసాద్, కె.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని వీరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వేడివేడి ఆహారాన్ని రుచికరంగా వండి పెట్టాలన్నారు. కట్టెల పొయ్యిపై వంటలు చేయొద్దన్నారు. ఎండీఎంలో ఎటువంటి లోటుపాట్లు ఉన్నా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా ఇక్కడ విద్యార్థులకు సిలబస్ ప్రకారం తరగతుల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాద్, సత్యనారాయణ

వడ్డాదిలో ఘనంగా మోదకొండమ్మ పండగ



వడ్డాదిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి ఘటాలు, నేల వేషాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో గ్రామదేవత మోదకొండమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ నాల్గు రోడ్ల జంక్షన్‌లో అమ్మవారి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత, నేల డాన్స్‌తో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో అమ్మవారికి పసుపుకుంకుమ, చీర, రవికె, నైవేద్యాలు సమర్పించారు. పది వేల జనాభా ఉన్న వడ్డాదిలో అమ్మవారి పండగను రెండు వర్గాలుగా విడిపోయి చేస్తున్నారు. గత వారం గ్రామంలో సగం మంది మోదకొండమ్మ పండగ చేయగా, ఈ రోజు మిగతా సగం మంది నిర్వహించారు. గ్రామం సుభిక్షం కోసం గ్రామపెద్దలంతా కలిసి ఒకేసారి పండగ నిర్వహిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

నారుమడిలో జాగ్రత్తలు తప్పనిసరి

దేవరాపల్లి: ఆరోగ్యకరమైన నారుమడికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ సూచించారు. పొలం పిలుస్తోంది లో భాగంగా మండలంలోని తారువ, ఎం. అలమండ గ్రామాల్లో మంగళవారం ఆమె క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో రైతులు, వ్యవసాయ సిబ్బందితో కలిసి వరి నారుమడులను పరిశీలించారు. వరి నారుమడి సంరక్షణ, నాట్లు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా ఏవో వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమై ఖరీఫ్ సాగులో పాటించాల్సిన మెలకువలు, తగిన మోతాదులో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని సూచించారు.



తారువ రైతు సేవా కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఏవో కాంతమ్మ

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు



అప్పలరాజుపురంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చీడికాడ: వరి నారుమడి, నాట్లు వేసే విధానంపై రైతుల్లో అవగాహన అవసరమని ఏవో కృష్ణవేణి తెలిపారు. మండలంలో అప్పలరాజుపురం, ఖండివరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో ఇప్పటి వరకు చేరని రైతులు ఉంటే రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ అసిస్టెంట్లు వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఎరువులు కావల్సిన రైతులు అప్పలరాజుపురం, ఖండివరం, తురువోలు, బైలపూడి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి డీఆర్సీ వ్యవసాయాధికారి వి.తులసీ, ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు పాల్గొన్నారు.